సాక్షి
నిజామాబాద్
శనివారం । 16 । ఆగస్టు । 2025



రైతులకు మరింత సేవ..

మరోసారి పదవీకాలం పొడిగింపుతో రైతులకు మరింత సేవచేసే భాగ్యం కలిగిందని డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



'ఓట్ల చోరీ' గడపగడపకూ..

ఓట్ల చోరీ అంశాన్ని గడపగడపకూ తీసుకెళ్లాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.4 /22.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- వేగంగా పెరుగుతున్న ప్రాజెక్ట్ నీటి మట్టం
- గంటగంటకూ ఎక్కువవుతున్న వరద



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతోంది. గురువారం 13,910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. శుక్రవారం ఉదయం నుంచి గంట గంటకూ పెరుగుతూ రాత్రి 9 గంటల వరకు 60 వేల క్యూసెక్కులకు చేరింది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 800, అలీసాగర్ లిఫ్ట్‌కు 180 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కులు వినియోగిస్తుండగా, ఆవిరి రూపంలో 502 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా, శుక్రవారం రాత్రి వరకు 1081.10(48 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

గోదావరికి పెరిగిన వరద



రెంజల్(బోధన్), నాలుగు రోజులుగా జిల్లాతోపాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరిలో వరద ప్రభావం పెరిగింది. కందకుర్తి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కర క్షేత్రంలోని పురాతన శివాలయం చుట్టూ వరద నీరు చేరింది.

నిజాంసాగర్‌లోకి భారీ వరద

25,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువన ఉన్న మెదక్, సంగారెడ్డి జిల్లాలలో కురుస్తున్న వర్షాలకు శుక్రవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సింగూరు ప్రాజెక్టుతో పాటు ఘనపురం ఆనకట్ట, హల్దీ వాగుల ద్వారా 25,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నిప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)కుగాను శుక్రవారం సాయంత్రానికి 1,394.92 అడుగుల (6.781 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

సింగూర్ మూడు గేట్ల ఎత్తివేత

ఎగువన సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి 27 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ఈ నీరు నిజాంసాగర్ ప్రాజెక్టును చేరనుంది.

సంక్షేమానికి పెద్దపీట



మహిళా సమాఖ్యకు చెక్కు అందజేస్తున్న ముఖ్య అతిథి నిరంజన్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- జిల్లాలో రూ.755 కోట్ల 29 లక్షల రుణ మాఫీ
- భూ భారతితో గ్రామ స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం
- 17,301 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- 11,852 నూతన రేషన్‌కార్డులు
- సజావుగా సంక్షేమ పథకాల అమలు
- స్వాతంత్య్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా ప్రసంగించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని, అర్హులందరికీ ఫలాలు అందుతున్నాయని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. 79వ స్వాతంత్య్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జెండా ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. జిల్లా రైతాంగానికి రూ.755 కోట్ల 29 లక్షల రుణ మాఫీ చేయడంతోపాటు ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 చొప్పున పంట పెట్టుబడి సాయం అందజేయడం జరిగిందని వెల్లడించారు. తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు భరోసా అందించడం జరిగిందన్నారు. 2047 నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ ఉండనుందని, ఆ సంకల్పానికి దార్శనిక పత్రమే 'తెలంగాణ రైజింగ్ 2047' అని పేర్కొన్నారు. ఇది కేవలం ప్రణాళిక కాదని, ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టే సంకల్పమని అన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై స్వాతంత్య్ర దినోత్సవ వేదికపైనుంచి నిరంజన్ ప్రసంగం సాగిందిలా..

రైతు రుణమాఫీ పథకం

జిల్లాలో 97,696 మంది రైతులకు రూ.755 కోట్ల 29 లక్షల పంట రుణం మాఫీ అయ్యింది. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందింది.

భూ భారతి

రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 40,462 దరఖాస్తులు అందాయి.

ఇందిరమ్మ ఇళ్లు

19,397 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లక్ష్యం. లబ్ధిదారులకు 17,301 ఇళ్లు మంజూరయ్యాయి. 9,486 ఇళ్ల మార్కింగ్ పూర్తి కాగా, 4,820 ఇళ్లు బేస్మెంట్, 742 రూఫ్, 237 స్లాబ్ లెవెల్ పనులు పూర్తయ్యాయి. రూ.60.36 కోట్లు ఖర్చు చేయడం జరిగింది.

వ్యవసాయ రంగం

వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు వరి 4.19 లక్షల ఎకరాల విస్తీర్ణంలో, మొక్కజొన్న 52 వేల ఎకరాలు, సోయాచిక్కుడు 33 వేల ఎకరాలు, పసుపు 23 వేల ఎకరాల విస్తీర్ణంలో మొత్తం సుమారు 5 లక్షల 33 వేల ఎకరాల్లో రైతులు పంటు సాగు చేస్తున్నారు. పంటల సాగులో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 1,746 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ లో ఉంది.

పౌర సరఫరాల శాఖ

జూన్ నుంచి ఆగస్టు వరకు మొత్తం 26,217 మెట్రిక్ టన్నుల ఉచిత సన్న బియ్యం పంపిణీ చేశాం. జనవరి నుంచి ఇప్పటి వరకు 11,852 నూతన రేషన్‌కార్డులు మంజూరు చేశాం.



ప్రసంగిస్తున్న నిరంజన్

మహాలక్ష్మి

2,19,330 మంది గ్యాస్ వినియోగదారులకు 10,19,994 సిలిండర్ల సబ్సిడీ విడుదల చేసి రూ.30 కోట్ల 73 లక్షలు చెల్లించడం జరిగింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి ఈనెల 10వ తేదీ వరకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్న మహిళలకు రూ.249 కోట్ల 13 లక్షలు ఆదా అయ్యాయి.

గృహజ్యోతి

గృహజ్యోతిలో భాగంగా మార్చి 2024 నుంచి జూలై 2025 వరకు ప్రతి నెలా 2,67,707 మంది వినియోగదారులకు జీరో బిల్లులు వచ్చాయి.

వైద్యారోగ్యం

టీబీ ముక్త్ భారత్‌కు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో కేవలం 1,211 మంది వ్యాధిగ్రస్తులు మాత్రమే చికిత్స పొందుతున్నారు.

విద్య

జిల్లాలో 1,156 పాఠశాలల్లో 90,359 విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతోంది. రెండు కేజీబీవీలు మంజూరయ్యాయి. ధర్పల్లి, ఇందల్వాయి, మెండోర, రుద్రూర్, మోపాల్ కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టాం.

అటవీశాఖ

జిల్లా మొత్తం అటవీ విస్తీర్ణం 2,14,056.38 ఎకరాలు. నేటి వరకు 27 లక్షల మొక్కలు నాటడం పూర్తయ్యింది. జిల్లాలో మొత్తం 542 నర్సరీలు ఏర్పాటయ్యాయి.

శాంతి భద్రతల పరిరక్షణ

డయల్ 100 ద్వారా ఫిర్యాదులు స్వీకరించి 5 నిమిషాల్లో పోలీసులు సమస్యలను పరిష్కరిస్తున్నారు. శాంతి భద్రతలను సామరస్యాన్ని కాపాడినందుకు, జిల్లాలో ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నందుకు జిల్లా పోలీస్ యంత్రాంగానికి అభినందనలు.

జాతీయ జెండాకు వందనం చేస్తున్న ముఖ్య అతిథి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య తదితరులు





స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న న్యాయమూర్తులు





నృత్యం చేస్తున్న శ్రీరామకృష్ణ విద్యాలయం విద్యార్థినులు

భారత మాత వేషధారణలో చిన్నారి

నృత్యం చేస్తున్న కంజర టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థినులు

గోదావరిలో జెండా వందనం



గలగలాపారే గోదావరిలో జాతీయ జెండా రెపరెపలాడింది. స్వాతంత్య్ర భారతావని వేడుకల్లో మునిగి ఉన్న వేళ మత్స్యకారులు కూడా 'మేము సైతం..' అంటూ దేశభక్తిని చాటుకున్నారు. నందిపేట మండలం ఉమ్మెడ గ్రామ సమీపంలోని గోదావరిలో తెప్పలపై గోదావరిలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. మత్స్యకారుల దేశభక్తికి అక్కడి వారంతా ముగ్ధులయ్యారు. – నందిపేట్ (ఆర్మూర్)

ఐక్యతే మనబలం

స్వాతంత్య్ర వేడుకల్లో స్నేహ సొసైటీ రూరల్ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన మానసిక దివ్యాంగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యునైటెడ్ వి స్టాండ్.. మేరా భారత్ మహాన్ తదితర నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శిస్తూ 75 మంది మానసిక దివ్యాంగులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి అయిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. – నిజామాబాద్ నాగారం



ఘనంగా స్వాతంత్య్ర వేడుక

- త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 79వ స్వాతంత్య్ర వేడుకలు శుక్రవారం పండుగ వాతావరణంలో జరిగా యి. వేడుకల కోసం జిల్లా యంత్రాంగం విస్తృత ఏ ర్పాట్లు చేయగా, రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమి షన్ చైర్మన్ ఎస్.నిరంజన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆయన.. పుర ప్రముఖులను, అధికారులు, అనధికారులను కలిసి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆయా శాఖల ఫొటో ఎగ్జిబిషన్, శకటాలను ఆసక్తిగా తిలకించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వాతంత్య్ర సమర యోధులను, వారి కుటుంబీకులను సన్మానించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్.భూపతి రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, స్వాతంత్య్ర సమరయోధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర వేడుకల వేదికపై నిరంజన్, ఎమ్మెల్యేలు

ఒకే వార్డులో కుటుంబమంతా..

- గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా సవరణ
- ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఉద్యోగులు
- ఎన్నికలకు ఖరారు కాని షెడ్యూల్
- క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లు

మోర్తాడ్(బాల్కొండ): గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం ఇంకా పచ్చజెండా ఊపకపోయినా క్షేత్రస్థాయిలో మాత్రం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఓటర్ల జాబితాను సవరిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు బిజీబిజీగా ఉన్నారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడంతో అనేక చోట్ల ఓటర్ల సంఖ్య పెరిగింది.ఈ నేపథ్యంలో ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే వార్డులో ఉండేలా సవరణ చేపట్టారు. గతంలో భార్య ఒక వార్డులో ఓటు హక్కు కలిగి ఉంటే, భర్త ఇతర కుటుంబసభ్యులు మరో వార్డులో ఓటు వేసేవారు. ఇలాంటి పరిస్థితి గందరగోళానికి దారి తీస్తుందనే ఉద్దేశంతో కుటుంబసభ్యులంతా ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.



మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

మార్పులు, చేర్పులు.. తొలగింపులు

జిల్లాలో పాత గ్రామ పంచాయతీలు 530 ఉండగా కొత్తగా విభజించిన పంచాయతీల సంఖ్య 15 ఉంది. మొత్తం వార్డులు 5022 ఉన్నట్లు అధికారులు గతంలో వెల్లడించారు. డిసెంబర్ 2024 నాటికి పంచాయతీలలో ఓటర్ల సంఖ్య 8,30,580గా నమోదైంది. ఈ సంవత్సరం ఆరంభంలో ఓటర్ల నమోదు చేపట్టగా సంఖ్య పెరిగింది. మరణించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించడం, కొత్తవారి చేరికతో ఓటర్ల జాబితా సవరణ అనివార్యమైంది. కాగా, ఓటర్ల జాబితాలను సవరిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పనిభారం పెరిగిందని పంచాయతీ ఉద్యోగులు చెబుతున్నారు.

ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది

ఓటర్ల జాబితాల సవరణ, ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు సూచించిన విధంగా ప్రతి పంచాయతీ ఓటర్ల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. – శ్రీధర్, ఎంపీవో, మోర్తాడ్

ముఖ గుర్తింపుతో 60శాతం

- నూతన విధానంతో జిల్లాలో 1,20,246 మందికి పింఛన్ల పంపిణీ
- వివిధ కారణాలతో మిగతా వారికి పాత పద్ధతిలోనే అందజేత

డొంకేశ్వర్(ఆర్మూర్): చేయూత పింఛన్ల పంపిణీలో మరింత పారదర్శకత కోసం టీజీ ఆన్‌లైన్ అభివృద్ధి చేసిన ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్(ఫేషియల్ రికగ్నిషన్)తో మొదటి సారిగా జిల్లాలో పింఛన్ల పంపిణీ పూర్తయింది. నూతన విధానం ద్వారా గ్రామాల్లో 60 శాతం మందికి పింఛన్లు అందజేయగా, మిగతా వారికి వివిధ కారణాలతో పాత పద్ధతిలోనే (వేలి ముద్రలు తీసుకుని) పంపిణీ చేశారు. ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ కారణంగా పింఛన్ల పంపిణీ వేగవంతంగా పూర్తయినట్లు పోస్టల్ అధికారులు చెబుతున్నారు. చేతి వేలిముద్రల ద్వారా 10 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేసేందుకు సుమారు అరగంట సమయం పట్టేది. ప్రస్తుతం ముఖ గుర్తింపు ద్వారా కేవలం 15 నిమిషాల్లోనే పంపిణీ పూర్తవుతోంది. దీంతో లబ్ధిదారులు పోస్టాఫీసులు, గ్రామ పంచాయతీల వద్ద ఎక్కువసేపు నిరీక్షించే పరిస్థితి పోయింది. అదే విధంగా గ్రామాల్లో బోగస్ పింఛన్లకు కూడా చెక్ పడినట్లయింది. బతికున్నవారే పింఛన్లు పంపిణీ చేసే చోటికి వచ్చి డబ్బులు తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో జూన్ నెలకు సంబంధించిన పింఛన్ డబ్బులు పోస్టల్ అధికారులు గ్రామీణ లబ్ధిదారులకు ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌తో పంపిణీ చేశారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కూడా ఈ ప్రక్రియను పరిశీలించారు. నిజామాబాద్ కార్పొరేషన్‌తోపాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల పరిధిలోని లబ్ధిదారులకు ఎప్పటిలాగే నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశారు.



ముప్కాల్‌లో ఫేస్ రికగ్నిషన్‌తో పింఛన్ పంపిణీ

గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ లబ్ధిదారులు	2,01,243
ముఖ గుర్తింపుతో పింఛన్ పొందినవారు	1,20,246
వేలి ముద్రలతో పొందిన వారు	80,154
పంచాయతీ కార్యదర్శుల ద్వారా పొందిన వారు	843

పంచాయతీ కార్యదర్శులకు తప్పిన భారం

ఇది వరకు లబ్ధిదారులందరికీ చేతి వేలిముద్రల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తూ వచ్చారు. వేలిముద్రలు రానివారికి సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి వేలిముద్రతో డబ్బులు అందజేశారు. పోయిన నెల వరకు పంచాయతీ కార్యదర్శులే బయోమెట్రిక్ పెట్టి జిల్లాలో సుమారు 12వేల మందికి పింఛన్లు ఇచ్చారు. ఇప్పుడు ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ రావడంతో వేలి ముద్రలు రాని లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పాయి. పంచాయతీ కార్యదర్శులతో పని లేకుండానే పింఛన్ డబ్బులు తీసుకున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శుల సహాయంతో పింఛన్లు పొందే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. తమకు కూడా పనిభారం తగ్గిందని పంచాయతీ కార్యదర్శులు ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

జిల్లా కోర్టులో జెండా ఆవిష్కరించిన జడ్జి



నిజామాబాద్ లీగల్: స్వాతంత్ర్య వేడుకలను జిల్లా కోర్టులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జీవీఎస్ భరతలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయభాస్కర్ రావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్జీలు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో కలెక్టర్..



నిజామాబాద్ అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తన క్యాంప్ ఆఫీస్‌తోపాటు జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి హోదాలో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమాల్లో ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, టీజీవో జిల్లా అధ్యక్షుడు కిషన్, కార్యదర్శి అమృత్‌కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్లపై కేసు నమోదు

మోర్తాడ్(బాల్కొండ): యూరప్ పంపిస్తామని నమ్మించి వేల్పూర్ మండలం పడిగెలకు చెందిన గంగాప్రసాద్‌ను యూఏఈలోనే ఉండిపోయేలా మోసగించిన ఇద్దరు గల్ఫ్ ఏజెంట్లపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ప్రవాసీ ప్రజావాణిలో బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి స్పందించి బాధితునికి న్యాయం చేయాలని సీపీ సాయి చైతన్యకు లేఖ రాశారు. సీపీ ఆదేశాల మేరకు ఆలూర్ మండలం మచ్చర్లకు చెందిన ఆర్ నారాయణ, హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ జబ్బర్‌లపై వేల్పూర్ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. దీంతో దుబాయ్‌లో చిక్కుకుపోయిన గంగాప్రసాద్‌ను స్వదేశానికి తీసుకొచ్చేందుకు విదేశాంగ శాఖ చొరవ తీసుకుంటుందని అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, చిత్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర సహకార చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, సిబ్బందికి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఉన్నతాధికారులు ఉద్యోగుల సేవలను అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు. – నెట్‌వర్క్



రాజేంద్రకుమార్, ఆర్డీవో, నిజామాబాద్

సురేశ్, జనరల్ మేనేజర్, ఇండస్ట్రీస్

నాగోరావ్, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్

దశరథ్, డిప్యూటీ డైరెక్టర్, ట్రెజరీస్

రాజశ్రీ, డీఎంహెచ్‌వో, నిజామాబాద్



శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా మేనేజర్, సివిల్ సప్లయ్స్

ఎ.రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

శ్రీనివాస్, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్, నిజామాబాద్

శివప్రసాద్, సబార్డినేట్ (డీఈవో)

వెంకట్‌రావు, తహసీల్దార్, ఇందల్వాయి



వినయ్ సాగర్, నాయిబ్ తహసీల్దార్, నిజామాబాద్ రూరల్

నవాబ్, ఎమ్మార్ఐ, నిజామాబాద్ సౌత్

సూర్యప్రకాశ్, సర్వేయర్, డిచ్‌పల్లి

రవళి, ఎంపీహెచ్‌వో, డిచ్‌పల్లి

గంగాధర్, తహసీల్దార్, కోటగిరి

సాయిలు, నాయిబ్ తహసీల్దార్, మోస్రా

సంతోష్‌రెడ్డి, తహసీల్దార్, మెండోరా

వసంత్‌రావు, నాయిబ్ తహసీల్దార్, నందిపేట

వందన, ఆయూష్ డీపీఎం

అశోక్ కుమార్, అసిస్టెంట్ డిప్యూటీ జైలర్



నాగరాజు, సెక్రటరీ, పీఏసీఎస్ రాంపూర్

రాములు, ఎండోమెంట్ ఈవో

నర్సింగ్‌రావు, ఫైర్‌స్టేషన్ ఆఫీసర్, నందిపేట

పుష్ప, ఎడ్యుకేషన్ ఆఫీసర్, నిజామాబాద్

రమేశ్, టీపీవో, మున్సిపల్, నిజామాబాద్

మహ్మద్ అబ్దుల్ మజీద్, సీనియర్ అసిస్టెంట్, డీపీఆర్వో

శ్రీనివాస్, ఏఎంవీఐ, నిజామాబాద్

రావుట్ల జనార్దన్, ఎన్‌జీవో

సయ్యద్ మస్తాన్ అలీ, ఏసీపీ, ట్రాఫిక్ నిజామాబాద్

వెంకటనారాయణ, సీఐ, బోధన్ టౌన్



చందర్‌రాథోడ్, సీఐ, బోధన్ ట్రాఫిక్

సురేశ్ సీఐ, నిజామాబాద్ సీసీఎస్

సత్యనారాయణ, సీఐ, భీమ్‌గల్

శ్రీనివాస్‌రాజ్, సీఐ, నిజామాబాద్ టౌన్

శివరాం, సీటీసీ సీఐ, నిజామాబాద్

అనిల్‌రెడ్డి, ఎస్సై, కమ్మర్‌పల్లి

రాజశేఖర్, ఎస్సై, మాక్లూర్

హరిబాబు, ఎస్సై, మూడో టౌన్

రజనీకాంత్, ఎస్సై, ముప్కాల్

ప్రవళిక, సీసీపీఎస్ ఎస్సై, నిజామాబాద్



సంతోష్‌రెడ్డి, సీఎస్‌బీ ఎస్సై, నిజామాబాద్

శ్రీనివాస్, ఏఆర్ ఎస్సై

గంగాధర్, ఏఆర్ ఏఎస్సై, ట్రాఫిక్

ఎండీ సలీం, ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్

ప్రేమ్‌కుమార్, సీపీ పీఆర్వో, హెడ్‌కానిస్టేబుల్

హరితరాణి, కానిస్టేబుల్, షీటీమ్ నిజామాబాద్

సుమతి, హెడ్‌కానిస్టేబుల్ షీటీమ్, ఆర్మూర్

శ్రీజ, కానిస్టేబుల్, మెండోరా

నిక్షిత, కానిస్టేబుల్, ఆర్మూర్

రాశి, కానిస్టేబుల్, రెంజల్

'ఓట్ల చోరీ' గడపగడపకూ తీసుకెళ్లాలి

- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి



న్యాల్‌కల్ మాసాని చెరువు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడుతుందని, సుప్రీంకోర్టు తీర్పు ఇందుకు నిదర్శనమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఓట్ చోర్.. గద్దె చోడ్ నినాదాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు గడపగడపకూ తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాసాని చెరువు గేట్లు ఎత్తి నిజాంసాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, ఓట్ల చోరీకి పాల్పడుతూ ప్రజల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. బిహార్‌లో 65లక్షల ఓట్లు తొలగించిందని, దీనిపై రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి..

మాసాని చెరువు నుంచి నిజాంసాగర్ కెనాల్ ద్వారా 15వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామని, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు. వర్షాలు ముందుగా కురవడంతో రైతులు త్వరగా నాట్లు వేశారని, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలకు సాగునీరు అవసరమని పేర్కొన్నారు. సొసైటీ పాలకవర్గాల గడువు పొడిగింపు శుభపరిణామమని, రైతులకు మరింత సేవ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ బోర్గాం శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ బాలరాజు, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు గంగాప్రసాద్, ప్రతాప్‌సింగ్, కిరణ్‌రావు, బొడ్డు రఘు, కెతడి నారాయణ, సడక్ శేఖర్, సతీశ్ రావు, సతీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అన్న వెంటే తమ్ముడు

- సోదరుని మరణాన్ని తట్టుకోలేక గుండెపోటుతో మృతి

వేల్పూర్: అన్న మరణాన్ని తట్టుకోలేక తమ్ముడు గుండెపోటుకు గురై మరణించిన ఘటన శుక్రవారం వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దివంగత రిటైర్డ్ టీచర్ అయ్యవార్ల మురళీధర్‌రావుకు భార్గవ్‌శ్యాం, ప్రేమ్‌కుమార్, విజయ్‌కుమార్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్దకొడుకు భార్గవ్‌శ్యాం ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటూ చాలా ఏళ్లుగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నివాసముంటున్నాడు. ప్రేమ్‌కుమార్ కలకత్తాలో ఉంటుండగా, విజయ్‌కుమార్ అంక్సాపూర్‌లో ఇంటి వద్దనే ఉండేవాడు. భార్గవ్ శ్యాం(57) కొద్దికాలంగా పక్షవాతంతో బాధపడుతూ గురువారం రాత్రి మరణించాడు. ఆయన మరణవార్తను శుక్రవారం ఉదయం అంక్సాపూర్‌లో ఉన్న తమ్ముడు విజయ్‌కుమార్‌కు తెలిపారు. దీంతో విజయ్‌కుమార్ తీవ్ర మనస్తాపం చెంది గుండెపోటుకు గురయ్యాడు. గ్రామస్తులు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. భార్గవ్‌శ్యాం అంత్యక్రియలు శుక్రవారం పూర్తికాగా, విజయ్‌కుమార్ అంత్యక్రియలు కలకత్తాలో ఉండే అన్న ప్రేమ్‌కుమార్ శనివారం ఇంటికి వచ్చిన తర్వాత నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అన్నదమ్ములు ఒకరివెంట ఒకరు మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



రాజంపేట: వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడికి తీవ్రగాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గుర్రాల రమేశ్ కొడుకు ధనుంజయ్(4) స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం 3గంటలకు మూత్ర విసర్జన కోసం పాఠశాల ఆవరణలోకి వెళ్లగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. దీంతో ధనుంజయ్‌కి తీవ్రగాయాలయ్యాయి. కుక్కలను తరిమే ప్రయత్నంలో ఓ ఉపాధ్యాయురాలిపై దాడికి యత్నించినట్లు తెలిసింది. విద్యార్థి ప్రస్తుతం కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్ర సమీపంలోని 161 జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాడు సాయవ్వ శుక్రవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం 161 జాతీయ రహదారి దాటుతుండగా పిట్లం నుంచి బిచ్కుంద వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. సాయవ్వకు గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సాయవ్వను మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



వ్యవసాయశాఖ శకటం



తెలంగాణ ఆర్టీసీ శకటం



తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ శకటం



జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ శకటం



పౌరసరఫరాల శాఖ శకటం



ట్రాన్స్‌కో శకటం

శకటాల ప్రదర్శన

నెట్‌వర్క్: స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా పరేడ్ మైదానంలో నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వ్యవసాయ, ఆర్టీసీ, హౌసింగ్, వైద్యారోగ్య, పౌరసరఫరాల, ట్రాన్స్‌కో, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శకటాలను ప్రదర్శించారు.



జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శకటం



జిల్లా పంచాయతీరాజ్ శకటం



టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కంజర విద్యార్థినులు



శ్రీరామకృష్ణ విద్యాలయం విద్యార్థినులు



జెడ్పీహెచ్ఎస్ నవీపేట విద్యార్థులు



నృత్యం చేస్తున్న నవీపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

నెట్‌వర్క్: నగరంలోని పరేడ్ మైదానంలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు దేశభక్తి, జానపద గేయాలకు తగ్గట్టుగా డ్యాన్సులు చేశారు.



విశ్వవికాస్ హైస్కూల్ విద్యార్థినులు

రైతులకు మరింత సేవ చేసుకునే అవకాశం

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి
- సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని సహకార సంఘాలు, డీసీసీబీల పాలకవర్గాల పదవీకాలం గడువు మరోసారి ఆరు నెలలు పొడిగించి రైతులకు మరింత సేవ చేసుకునే భాగ్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రివర్గం కల్పించిందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయ ఆవరణలో శుక్రవారం పాలకవర్గాల గడువు ఆరు నెలలు పొడిగించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రమేశ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీసీసీబీని రాష్ట్రంలోనే ఉత్తమమైన బ్యాంకుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రధానంగా ఎన్‌పీఏ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించామని, అందరి సహకారంతో బ్యాంకుకు పూర్వవైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకార సంఘాల చైర్మన్లు, బ్యాంకు డైరెక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.



ఎన్‌డీసీసీబీలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రమేశ్ రెడ్డి